ఈనాడు
కామారెడ్డి
శనివారం అక్టోబరు 5, 2024


## మహాలక్ష్మి పథకంతో లాభాల్లో ఆర్టీసీ : మంత్రి పొన్నం

**నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే:** మహాలక్ష్మి పథకంతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల బాట పట్టిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నిజామాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో శుక్రవారం ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు 500 ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌కు 67 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించామన్నారు. ప్రస్తుతం 13 అందుబాటులోకి వచ్చాయన్నారు. మహాలక్ష్మి పథకంతో ఇప్పటివరకు 94 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో కొత్త బస్సులు కొనుగోలు చేయక.. ఒక ఉద్యోగం ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులు వారి కుటుంబసభ్యుల సహకారంతోనే మహాలక్ష్మి పథకం విజయవంతమైందన్నారు. కారుణ్య నియామకాలు చేపడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ నగర్ మేయర్ నీతూకిరణ్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## 9, 23 తేదీల్లో సదరం శిబిరాలు

**కామారెడ్డి కలెక్టరేట్:** జిల్లాలో వైకల్య నిర్ధారణకు ఈ నెల 9, 23వ తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ పేర్కొన్నారు. మీ- సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి శనివారం వరకు టోకెన్ బుక్ చేసుకోవాలని తెలిపారు. సెర్ప్ నుంచి పంపే సందేశం, ఆధార్‌కార్డు, మెడికల్ నివేదికలతో కామారెడ్డి జిల్లా ఆసుపత్రిలో ఉదయం 9 గంటలకు నిర్వహించే శిబిరానికి హాజరు కావాలని కోరారు. నవీకరణకు సంబంధించిన వారు అక్టోబరు 5వ తేదీన ఉదయం 11 గంటల నుంచి టోకెన్ బుక్ చేసుకోవాలని సూచించారు.


వేదికపై మండవ వెంకటేశ్వర రావు, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, అజారుద్దీన్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వీహెచ్, ఎమ్మెల్యే పోచారం, వేంనరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపీ సురేశ్ షెట్కర్, సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు

# ఇందూరు అభివృద్ధికి ముందుంటా

### సన్మాన సభలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

విద్యార్థి దశ నుంచి కష్టపడిన తనను పార్టీ గుర్తించి.. ఇంతటివాడిని చేసిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలుపునకు పనిచేసిన ప్రతి నాయకుడికి వచ్చే రోజుల్లో పదవి దక్కే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. పీసీసీ బాధ్యతలు చేపట్టాక.. శుక్రవారం తొలి సారిగా జిల్లాకు చేరుకున్న ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మాధవనగర్ సాయిబాబా ఆలయంలో పూజలు చేసిన అనంతరం నగరం వీధుల్లో ర్యాలీగా సన్మాన సభ వేదిక వద్దకు చేరుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ (నాగన్న చెరువు గ్రామం) నుంచి దిల్లీ వరకు గుర్తించే పదవి దక్కిందంటే ఆ గ్రామంలో తాగిన నీరు.. తల్లి దండ్రులు చేసుకున్న పుణ్యమన్నారు. రాజకీయంగా డీఎస్‌తో విభేదాలున్నా.. నా రాజకీయ గురువు ఆయనే అన్నారు. తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చి ప్రోత్సహించారని.. పదవి వచ్చాక ఆశీర్వాదం తీసుకోవాలకున్నానని, డీఎస్ మనమధ్య లేకపోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు. 27 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని పార్టీ కల్పించినా.. గెలవలేకపోయానన్నారు. ఓటములు, అవమానాలు ఎదురైనప్పటికీ.. వాటి నుంచి తేరుకొని ముందుకెళ్లానన్నారు.

#### ప్రాధాన్యమివ్వాలి...


ఒకప్పుడు ధాన్యాగారంగా విరిసిల్లిన ఇందూరు జిల్లా.. ఇప్పుడు వెనుకబడిందన్నారు. చక్కెర పరిశ్రమలతో ఎంతో సుసంపన్నంగా ఉండేదని.. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడిది పీసీసీ అధ్యక్షుడు ఉన్న జిల్లా అని, వేదిక మీద ఉన్న మంత్రులు నిధులు కేటాయించే విషయంలో దృష్టి సారించాలని నవ్వుతూ సూచించారు. పనుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. కాళేశ్వరం 21వ ప్యాకేజీ పనులు నిలిచిపోయాయని, ఆర్థిక మంత్రిని నిధులడిగితే.. ఇద్దామంటున్నారు తప్ప.. ఇంకా ఇవ్వలేదన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట.. భట్టి విక్రమార్క వింటారని తనకు తుమ్మల నాగేశ్వరరావు, మరికొందరు తెలిపారని చమత్కరించారు. నిధుల విషయం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కతో శ్రీధర్‌బాబు మాట్లాడాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో మంచి అవకాశం ఉందని.. ఈ దిశగా కృషి చేయాలని కోరారు. జిల్లాకు మరో ప్రభుత్వ వైద్యకళాశాలతో పాటు ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకత ఉందన్నారు. జిల్లాలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తారని, రానున్న రోజుల్లో ప్రభుత్వపరంగా సహాయం అందిస్తామన్నారు. నిఖత్ జరీన్, సిరాజ్‌కు నిబంధనలు సడలించి డీఎస్పీ పోస్టులు ఇచ్చేలా కృషి చేశామన్నారు. పార్టీ కార్యక్రమం కావటంతో ప్రైవేటు హెలికాప్టర్‌లోనే మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి, కుటుంబ సభ్యులు నిజామాబాద్ వచ్చారని చెప్పారు. సభలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, లక్ష్మీకాంతరావు, లక్ష్మణ్‌కుమార్, కేఆర్ నాగరాజు, కార్పొరేషన్ ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, కాసుల బాలరాజ్, మార గంగారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాసింగ్, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, రాజేశ్వర్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు నగేష్‌రెడ్డి, గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశ వేణు, ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, సుజాత పాల్గొన్నారు.

#### తరలివచ్చిన మంత్రులు

పీసీసీ అధ్యక్షుడి సన్మాన సభకు ఆరుగురు రాష్ట్ర మంత్రులు తరలొచ్చారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సభలో తమ ప్రసంగాలతో మహేష్‌కుమార్ గౌడ్ పార్టీకి చేసిన సేవలను వివరించారు. సభా వేదికపై పీసీసీ అధ్యక్షుడిని సన్మానించేందుకు నాయకులు పోటీపడ్డారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీలను సన్మానిస్తున్న నాయకులు : నగరంలో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు




సభకు హాజరైన పార్టీ శ్రేణులు

#### వైద్యకళాశాలకు సోనియా పేరు..

నిజామాబాద్‌లో కాంగ్రెస్ హయాంలో ఏర్పాటైన వైద్యకళాశాలకు సోనియా గాంధీ పేరు పెట్టాలని పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీ పేర్కొన్నారు. నాయకులంతా తన ప్రతిపాదనను ఆమోదించాలని వేదికపైనుంచి కోరారు. పార్టీకి జిల్లాలో సరైన కార్యాలయ భవనం లేదన్నారు. నిర్మాణం కోసం రూ.5 లక్షలు విరాళం ఇస్తున్నట్లు, అందరూ సహకరించాలని, భవనం నిర్మించే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు తీసుకోవాలన్నారు.

#### రెండో రంజీ మ్యాచ్ ఆడిందిక్కడే

అంతర్జాతీయ క్రికెట్ ఆడిన తాను.. తొలినాళ్లలో తన రెండో రంజీ మ్యాచ్ నిజామాబాద్ మైదానంలోనే ఆడానని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్ తెలిపారు. క్రికెట్‌లో ఎదిగిన మాదిరిగానే.. మహేష్‌గౌడ్ కాంగ్రెస్‌లో ఎంతో కష్టపడి ఈస్థాయికి ఎదిగారన్నారు. ఆయనకు తమ పూర్తి సహాయసహకారాలు అందించి.. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అంతా కలిసి పనిచేస్తామన్నారు. తనకు సమయం ఎక్కువగా లేనందున్న తన ప్రసంగాన్ని టీ-20 మ్యాచ్ కూడా కాదు.. ఏకంగా టీ-5 మ్యాచ్‌లా ముగిస్తున్నట్లు చెప్పి నవ్వులు కురిపించారు.

# వరికే మొగ్గు

### తగ్గుతోన్న చెరకు సాగు విస్తీర్ణం



ఈనాడు, కామారెడ్డి

జిల్లా రైతులు కొన్నేళ్లుగా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంటల సాగు ఏటా తగ్గిపోతోంది. గానుగాడించే చక్కెర కర్మాగారాలు ఉన్నా.. చెరకు పంట విస్తీర్ణం గత ఐదేళ్లతో పోల్చితే ఈ ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయింది. మార్కెటింగ్ సౌకర్యం లేని కారణంగా పత్తి సాగుపై రైతులు అనాసక్తి చూపుతున్నారు. దీంతో పంటమార్పిడి లేకుండా ఏటా వరి సాగుచేయడంతో దిగుబడులు గణనీయంగా తగ్గడంతో అన్నదాతల ఆదాయ వృద్ధి అంతంతమాత్రంగానే ఉంటున్న తీరుపై కథనం.

#### తియ్యటి పంట.. కన్నీరు కంట

గిట్టుబాటు కాకపోవడంతో రైతులు చెరకు సాగుకు స్వస్తి చెబుతున్నారు. ప్రైవేటు కర్మాగారాల నిర్వాహకులు ఒప్పందాలకు అనుగుణంగా చెరకును గానుగాడించేందుకు ఫ్యాక్టరీకి తరలించడం లేదు. సాగునీటి వసతుల్లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో కొందరు రైతులు చెరకును పండిస్తున్నారు. పూర్వం బెల్లం తయారు చేసి విక్రయించుకునేవారు. దీంతో లాభాలు వచ్చేవి. ప్రస్తుతం బెల్లం వండకంపై ప్రభుత్వం నిషేధం అమలు చేయడం కూడా ఈ పంట సాగు తగ్గడానికి మరో కారణంగా తెలుస్తోంది.

#### దళారులు చెప్పిందే ధర

నీటి వసతులు లేక గాంధారి, ఎల్లారెడ్డి, సదాశివనగర్, రాజంపేట, దోమకొండ, పిట్లం, మద్నూర్, జుక్కల్, రామారెడ్డి, మాచారెడ్డి, బీబీపేట మండలాల్లో పలువురు రైతులు వర్షాధార పంటగా పత్తి సాగుచేసేవారు. మార్కెటింగ్ సౌకర్యం లేక పల్లెలకు వచ్చే దళారులకు పంట విక్రయించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. జిల్లా సరిహద్దులో మద్నూర్‌లో మాత్రమే జిన్నింగ్ మిల్లులుండడంతో అక్కడే సీసీఐ కొనుగోలు కేంద్రాలను తెరుస్తున్నారు. దీంతో తెల్లబంగారం పండించే రైతులు గత్యంతరంలేక దళారులకు విక్రయిస్తున్నారు. కనీస మద్దతు ధరకు విక్రయించుకోలేని పరిస్థితులుండడంతో పెట్టుబడులు సైతం రాని దుస్థితి. దీంతో పత్తి సాగు క్రమేపీ తగ్గుతోంది. రైతులు ఆహార, వాణిజ్య పంటల సాగుపై దృష్టిపెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏటా రెండు సీజన్లలో ఒకేరకమైన పంటలు పండిస్తే దిగుబడులు తగ్గడంతో పాటు నేలలు చౌడుబారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**పంటల విస్తీర్ణం వివరాలు (ఎకరాలలో)**

| సంవత్సరం | చెరకు | పత్తి | వరి(వానాకాలం) |
|---|---|---|---|
| 2020–21 | 3876 | 53,412 | 2,95,876 |
| 2021–22 | 2593 | 41,765 | 3,00,451 |
| 2022–23 | 1976 | 32,986 | 3,12,325 |
| 2023–24 | 1583 | 29,189 | 3,17,084 |
| 2024–25 | 647 | 33,759 | 3,13,090 |

#### తలసరి ఆదాయం అంతంత మాత్రమే

జిల్లా రాష్ట్రంలో వరి సాగుకు ప్రసిద్ధి. ఏటా ఈ పంట విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. జిల్లా తలసరి ఆదాయానికి వచ్చే సరికి అంతంత మాత్రంగానే ఉంది. అన్నదాతల ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ఏడాదిలో వ్యక్తి ఆర్జించే ఆదాయాన్ని తలసరి ఆదాయం అంటారు. ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని బట్టి తలసరి ఆదాయాన్ని లెక్కిస్తారు. తలసరిలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో 26వ స్థానంలో ఉంది.

**పౌరుల తలసరి ఆదాయం(రూ.ల్లో)**

| జిల్లా | 2018–19 | 2019–20 | 2020–21 | 2021–22 |
|---|---|---|---|---|
| కామారెడ్డి | 1,23,688 | 1,51,659 | 1,49,575 | 1,70,795 |

## నేటితో ధ్రువపత్రాల పరిశీలనకు తెర

న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. శుక్రవారం 296 మంది ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించారు. మూడు రోజుల్లో మొత్తం 903 మంది విచారణ దరఖాస్తులను విద్యాశాఖ కార్యాలయంలో స్వీకరించారు. జిల్లాలో 506 పోస్టులకుగాను 1518 మంది అర్హత సాధించారని భావించినా.. అధికారులు మాత్రం 1249 మంది అభ్యర్థుల వివరాలు జాబితాలో వచ్చాయని వెల్లడించారు. శనివారం సాయంత్రం 5 గంటల్లోగా విద్యాశాఖ అధికారులు సూచించిన వారంతా కార్యాలయానికి ధ్రువపత్రాలతో రావాల్సి ఉంటుంది. ఇప్పటికే 10 బృందాలను ఏర్పాటుచేశారు. ప్రతి కేంద్రం వద్ద అభ్యర్థులు వరుస కట్టి తమ పత్రాలను అధికారుల చేత పరిశీలన చేయిస్తున్నారు.

#### జాబితాలన్నీ వెల్లడి

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అత్యధికంగా స్థానిక సంస్థల బడుల్లో ఎస్టీజీ 261, సాధారణ బడుల్లో 11 పోస్టులు ఉన్నాయి. ఇక స్కూల్ అసిస్టెంట్ల పోస్టుల్లో అత్యధికంగా ఉన్నవి సాంఘిక 40, ప్రత్యేక ఎడ్యుకేషన్ 36, ఎస్ఏ తెలుగు 17 స్థానాల్లో భర్తీ చేస్తున్నారు. గత నెల 30న డీఎస్సీ ఫలితాలు విడుదలైనా ఆ తర్వాత రోజు జాబితాలు వెల్లడి కాక పరిశీలన ప్రక్రియ నిలిచింది. 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అవకాశం కల్పించడంతో అభ్యర్థులు విద్యాశాఖ కార్యాలయానికి వరుస కట్టారు. 4వ తేదీ మధ్యాహ్నం వరకు అన్ని విభాగాల వారీగా అర్హత సాధించినవారి జాబితాలు వెల్లడయ్యాయి.

#### ఈ డీఎస్సీలోనే ఎస్జీటీలకు అవకాశం

డీఎస్సీలో మొత్తం 272 ఎస్జీటీ పోస్టులను భర్తీ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా ఎస్జీటీ స్థానాలు ఉన్న జిల్లాల్లో కామారెడ్డి ఒకటి. ఈ సారి బీఈడీ చదివిన వారికి ఎస్జీటీ పోస్టులకు అనర్హులుగా ప్రకటించారు. దీంతో టీటీసీ పూర్తిచేసిన వారికి ఈ డీఎస్సీ సదావకాశంగా మారిందని విద్యా నిపుణులు వెల్లడించారు. అభ్యర్థులు తమ ధ్రువపత్రాల పరిశీలనకు శనివారం తప్పనిసరి రావాలని డీఈవో రాజు సూచించారు. గడువులోగా స్పందించకుంటే అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందన్నారు.

## 50 ఎకరాల్లో ఐటీ కారిడార్ ఏర్పాటు

**సదాశివనగర్, న్యూస్‌టుడే :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మాదిరి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 50 ఎకరాల్లో ఐటీ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మర్కల్‌లోని కల్యాణమండపంలో జరిగిన సదాశివనగర్ మార్కెట్ కమిటీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారానికి జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఎలాంటి పదవులు ఆశించకుండా కాంగ్రెస్ పార్టీని, మదన్‌మోహన్‌రావును నమ్ముకొని పనిచేసిన వారికే మార్కెట్ కమిటీల్లో చోటు దక్కిందన్నారు. అధికారం లేకున్నా నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ పార్టీ కోసం పనిచేశారని కొనియాడారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందగానే గాంధారికి మినీ స్టేడియం మంజూరు, ఎల్లారెడ్డిలో రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎల్లారెడ్డిలో బస్టాండు నిర్మాణానికి రూ.2.50 కోట్లు, రామారెడ్డిలోని ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.18 లక్షలు, తాడ్వాయి మండలం ఎర్రాపహడ్ పాఠశాలకు రూ.14 లక్షలు మంజూరు చేయించానన్నారు. సదాశివనగర్‌లోని లింగంపల్లిలో ఆగ్రో బయోటెక్ ఫ్యాక్టరీ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, ఇందులో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణం స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

**కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే:** వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని కామారెడ్డి అటవీ రేంజి అధికారి రమేష్ పేర్కొన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కళాశాల ప్రధానాచార్యుడు, అధ్యాపకులు, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో అటవీ శాఖ అధికారులు

## వంద పడకల ఆసుపత్రికి ఆర్థికశాఖ అనుమతి

**కామారెడ్డి వైద్యవిభాగం, దోమకొండ, న్యూస్‌టుడే:** దోమకొండలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ఆర్థికశాఖ శుక్రవారం అనుమతి ఇచ్చింది. 30 పడకలు ఉన్న సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని వంద పడకల స్థాయి పెంచాలనే డిమాండ్ కొంత కాలంగా ఉంది. రాష్ట్రవైద్యశాఖకు అందిన ప్రతిపాదనల ఆధారంగా తాజాగా ఆసుపత్రి ఏర్పాటులో కదలిక వచ్చినట్లయింది. కామారెడ్డిలో వంద పడకల ఆసుపత్రి ఉండగా గతేడాది బోధనాసుపత్రి స్థాయి పెరిగి 330 పడకలకు చేరింది. జిల్లాకు ఒక వైద్యకళాశాల ఏర్పాటుతో జిల్లా ఆసుపత్రుల స్థాయి కోల్పోయింది. ఆ తర్వాత బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రాంతీయాసుపత్రులుగా సేవలందిస్తున్నాయి. పది సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో రోగులకు సేవలు అందుతున్నాయి. కామారెడ్డికి సమీపంలో ఉన్న దోమకొండకి ఆనుకుని సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, మెదక్ జిల్లాలు ఉన్నాయి. ఎన్‌హెచ్44 ఉండటంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువే. జిల్లా కేంద్రంలోని బోధనాసుపత్రిపై భారం తగ్గించేందుకు దోమకొండలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. తాజాగా ఆర్థికశాఖ కూడా సమ్మతించడంతో తదుపరి ఉత్తర్వులు రావడమే ఆలస్యమని వైద్యాధికారులు చెబుతున్నారు.


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

## పకడ్బందీగా ఇంటింటి సర్వే

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** పకడ్బందీగా ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు బల్దియా కమిషనర్ శ్రీహరి రాజు పేర్కొన్నారు. డిజిటల్ హెల్త్‌కార్డులో భాగంగా పట్టణంలోని మొదటి వార్డు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ సిబ్బంది చేత శుక్రవారం సర్వే చేపట్టారు. ఈ నెల 8వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పుర మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు.

# ఆగుతూ.. సాగుతూ..

● నత్తనడకన రైల్వే పై వంతెనల నిర్మాణాలు

నిజామాబాద్ జిల్లాలోని పలు చోట్ల రైల్వే పై వంతెన(ఆర్వోబీ)ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తి నిర్మాణాలతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. నెల రోజులు పనులు జరిగితే మరో రెండు నెలలు నిలిచిపోతున్నాయి. ఆర్మూర్‌లోని మామిడిపల్లి, మాక్లూర్ మండలం మామిడిపల్లి వద్ద, నిజామాబాద్‌లోని మాధవనగర్, అర్సపల్లిలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. బోధన్‌లో శంకుస్థాపన జరిగిన పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తిచేస్తే వేలాది మంది వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయి. ఆ దిశగా అధికారులు కృషి చేయాల్సిన అవసరముంది.

● ప్రాంతం ◆ పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి ❖ కేటాయించిన నిధులు ☛ ఇప్పటి వరకు ఖర్చు చేసినవి ➾ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి ★ జాప్యం జరగడానికి కారణాలు ●● రాకపోకలకు తలెత్తుతున్న ఇబ్బందులు ◆◆ నిత్యం రాకపోకలు సాగించే వాహనాలు ★★ అధికారి వివరణ

నిజామాబాద్ - బోధన్ రహదారి

నిజామాబాద్ అర్సపల్లి బైపాస్ రహదారి

నిజామాబాద్ ప్రధాన రహదారి

నిజామాబాద్ - కరీంనగర్ రహదారి

పరిశీలన



### శంకుస్థాపనకే పరిమితం

● బోధన్ ◆ 2024 ఫిబ్రవరి 26(శంకుస్థాపన) ❖ రూ.160కోట్లు ☛ ఏమీ చేయలేదు ★ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఐదేళ్లలో వంతెన నిర్మాణానికి సంబంధించిన సంయుక్త సర్వే చేపట్టినా ఎప్పుడు ప్రారంభిస్తారన్న స్పష్టత లేదు. ●● రైలు వచ్చినప్పుడు నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. తరచూ గేటు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ◆◆ 5000

– న్యూస్‌టుడే, బోధన్ పట్టణం



● అర్సపల్లి బైపాస్ సమీపంలోని చెరువు వద్ద ◆ 2023 ఆగస్టు ❖ 137.05కోట్లు ☛ రూ.20 కోట్లు ➾ 25 శాతం ★ చెరువు పక్కన ఉన్న భూమి యజమాని కోర్టుకు వెళ్లడంతో స్థల సేకరణకు డబ్బులు చెల్లించలేదు. ●● బాసర, బోధన్ వైపు వెళ్లే వాహనాలు ఇదే మార్గంలో వెళ్లడంతో రద్దీగా ఉంటోంది. బైపాస్ వద్ద రైల్వే గేటు పడినప్పుడు కి.మీ పరిధిలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ◆◆ 3000

– న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం



### గేటు పడితే అర గంట ఆగాల్సిందే

● నిజామాబాద్ రూరల్ మాధవనగర్ ◆ 2022 ❖ రూ. 93.12 కోట్లు ☛ రూ. 33 కోట్లు ➾ 40 శాతం ★ నిధులు సమయానికి కేటాయించకపోవడంతో సమస్య నెలకొంది ●● ఇరువైపులా సర్వీసు రోడ్లు గుంతలమయంగా మారాయి. గేటు పడితే 15నుంచి 20 నిమిషాల పాటు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ◆◆ 3000 ★★ నిత్యం పనులు పర్యవేక్షిస్తున్నాం.. 40 శాతం వరకు పూర్తయ్యాయి. త్వరగా జరిగేలా చూస్తామని ఆర్అండ్‌బీ డీఈ ప్రవీణ్ చెప్పారు.

– న్యూస్‌టుడే, డిచ్‌పల్లి గ్రామీణం



### ఎనిమిదేళ్లయినా అసంపూర్తిగానే..

● మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి ◆ 2017 ❖ రూ. 23.9 కోట్లు ☛ రూ. 18.5 కోట్లు ➾ 80 శాతం ★ మొరం లేకపోవటంతోనే పనుల్లో జాప్యం జరిగింది. ●● ఒకే మార్గం ఉండటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గేటు పడిన సమయంలో ప్రయాణికులు గంట పాటు వేచి ఉండాల్సి వస్తోంది. ◆◆ 3000 ★★ పనుల్లో వేగం పెరిగింది డిసెంబరు వరకు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఆర్అండ్‌బీ డీఈఈ మల్లారెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం



### మిగతా 10శాతానికి ఆలస్యం..

● ఆర్మూర్‌లోని మామిడిపల్లి ◆ 2017 ❖ రూ. 34.90 కోట్లు ☛ రూ.30 కోట్లు ➾ 90 శాతం ★ నిధులు ఉన్నా పనులు జరగటం లేదు. వంతెనపై రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. ●● పనులు పూర్తికానందున 4 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో అర గంట సమయం వృథా అవుతోంది. ◆◆ 4500 ★★ 10 శాతం పనులు పూర్తికావాల్సి ఉంది. ఈ నెలలో పూర్తిచేస్తామని ఆర్అండ్‌బీ డీఈఈ మల్లారెడ్డి తెలిపారు.

– ఆర్మూర్ గ్రామీణం



## ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

**నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే:** ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అపరాధ రుసుంతో ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రవేశ రుసుం రూ. 1550తో పాటు రూ.100, ఇంటర్మీడియెట్ ఫీజు రూ. 1800తో పాటు రూ. 200 అపరాధ రుసుంతో ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలన్నారు. వివరాలకు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త రవీందర్ చరవాణి నెంబరు 80084 03518, 98492 34696లలో సంప్రదించాలని సూచించారు.

## 42 మంది గైర్హాజరు

**నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే:** నగరంలోని ఆదర్శ హిందీ విద్యాలయంలో శుక్రవారం జరిగిన ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 42 మంది గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆంగ్లంలో 108 మందికి 81, ఇంటర్ ఆంగ్లంలో 68 మందికి 53 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు.

# సమావేశాలు.. పనుల గుర్తింపు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్



జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. 2025- 26 ఏడాదికి సంబంధించిన కార్యాచరణపై గ్రామాల్లో విస్తృతంగా సభలు నిర్వహిస్తున్నారు. అక్టోబరు 2 నుంచి ఆయా పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు, కూలీలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరై చర్చిస్తున్నారు. మొత్తం 56 రకాల పనులు చేపట్టడమే లక్ష్యంగా అంచనాలు రూపొందిస్తున్నారు. ఈ నెలాఖరుకు గ్రామ సభలు పూర్తి చేసి మండల పరిషత్‌లకు ఆ తర్వాత జిల్లాకు పంపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ ఏడాదికి సంబంధించిన పనులు కొనసాగుతాయి. ఆ తర్వాత ఏప్రిల్ 1 నుంచి కొత్తగా గుర్తించిన పనులు ప్రారంభిస్తారు.

| | కామారెడ్డి | నిజామాబాద్ |
|---|---|---|
| గ్రామ పంచాయతీలు | 526 | 530 |
| జాబ్‌కార్డులు | 2,52,790 | 2,65,198 |
| నమోదైన కూలీలు | 5,28,794 | 5,41,818 |

### పారదర్శకంగా...

నిధులు పక్కదారి పట్టకుండా గ్రామ సభలు కీలకంగా మారాయి. గతంలో ఇష్టానుసారంగా పనుల గుర్తింపు ఉండేది. కూలీలు, ప్రజల భాగస్వామ్యం లేక పోవడంతో ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయాలు సామాజిక తనిఖీల్లోనూ వెలుగు చూశాయి. దీంతో ప్రభుత్వం పారదర్శకత కోసం గ్రామసభలు నిర్వహిస్తుంది. క్షేత్రస్థాయిలో పనుల గుర్తింపునకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

### సీజన్‌కు అనుగుణంగా..

సభల్లో సీజన్‌లకు అనుగుణంగా పనులు గుర్తిస్తున్నారు. వ్యవసాయ సీజన్ మెండుగా ఉన్న రోజుల్లో కూలీల హాజరు తక్కువగా ఉంటుంది. అందుకే వ్యవసాయ పనులు లేని సమయంలో అత్యధిక శాతం మందికి పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉభయ జిల్లాల్లో ముఖ్యంగా భూగర్భజలాల పెంపునకు అవసరమైన పనులకే ప్రాధాన్యమిస్తున్నారు. చెరువులు, కాలువలు, కుంటల్లో పూడికతీత, కాలువల్లో పిచ్చిమొక్కలు, పొదలను శుభ్రం చేయడం, నీటి కుంటల నిర్మాణం, కాంటూరు, సమతల కందకాల తవ్వకం, అంతర్గత మట్టి రోడ్లు, మొక్కలు, పండ్ల తోటల పెంపకం వంటివి గుర్తిస్తున్నారు.

### ఎక్కువ మందికి ఉపాధి కల్పనే లక్ష్యం..

-సురేందర్, డీఆర్‌డీవో, కామారెడ్డి

జిల్లా వ్యాప్తంగా అక్టోబరు 2 నుంచి సభలు నిర్వహిస్తున్నాం. అందరి ఆమోదంతో పనుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంది. ఎక్కువ మంది కూలీలకు పని కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

# భిన్న సంప్రదాయం.. బతుకమ్మపై మమకారం

● పూలపండగలో ఉత్తరభారతీయులు



బతుకమ్మ సంబరంలో..

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఉపాధి.. వ్యాపారాల నిమిత్తం నిజాం కాలంలోనే ఇందూరుకు వచ్చి స్థిరపడిన రాజస్థానీయులు, గుజరాతీయులు, మారాఠీలు, బంజారాలు వంటి ఉత్తరభారతీయులు.. తమ సంప్రదాయాన్ని ఆచరిస్తూ దసరా నవరాత్రుల్లో గర్బ, దాండియా ఆటలు ఆడుతూనే.. బతుకమ్మపై అభిమానాన్ని చాటుకుంటూ పూలతో అమ్మవారిని పేర్చి పాటలు పాడుతూ.. ఆటలు ఆడుతున్నారు. విభిన్న సంస్కృతుల సమ్మేళనంగా.. మినీ భారతంగా ఇందూరుకు అరుదైన గౌరవం తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మపై వారి స్పందన.

### మా అందరికీ ఇష్టం..

..మాపి రాథోడ్, మార్వాడిగల్లీ, నిజామాబాద్



మా మార్వాడీ ఘూమర్, కల్బేలియ నృత్యాలతో సమానంగా బతుకమ్మ నృత్యాలు చేస్తాం. గార్బా, దాండియాల మాదిరిగానే బతుకమ్మ ఆటలు ఆడుతున్నాం. అన్ని దేవుళ్లను పూలతో పూజిస్తాం. కాని ఇక్కడ బతుకమ్మను పూలతో తయారుచేయడం బాగుంది. ప్రకృతిలోని పూలను గౌరవించాలనే సందేశాన్నిస్తున్నారు.

### తీజ్‌తో సమానంగా..

..భవ్యశ్రీ, సిరికొండ



మా బంజారాల్లో తీజ్ పండగను ఎలా చేసుకుంటామో బతుకమ్మను కూడా అలాగే ఘనంగా జరుపుకొంటున్నాం. పూలతో అమ్మవారిని పేర్చడం అమ్మ నిర్మల ద్వారా నేర్చుకున్నా. తొమ్మిది రోజులు అందరం కలిసి రోజూ సాయంత్రం బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటున్నాం. అన్ని తండాల్లో బతుకమ్మ ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.

### మహారాష్ట్ర నుంచి..

..హాసిని (మరాఠీ), అంబేడ్కర్ కాలనీ, నిజామాబాద్



వేలాది మంది మరాఠీలు ఇక్కడ స్థిరపడ్డారు. ఇందూరుకు మాకు ఆత్మీయ అనుబంధం ఉంది. మాతృభాష మరాఠీ అయినా తెలుగు మాధ్యమంలోనే చదువుకుంటున్నాం. ముఖ్యంగా బతుకమ్మ పండగ వచ్చిందంటే చాలు మా కాలనీలో సందడిగా ఉంటుంది. మేమే అడవికి వెళ్లి గునుగ, తంగెడు వంటి పూలను తీసుకొచ్చి బతుకమ్మ పేర్చుతాం. పసుపు గౌరమ్మను పూజిస్తాం.

### ఆటపాటలపై శిక్షణ

..ఐశ్వర్య, ప్రకృతి చికిత్స, యోగా వైద్యురాలు, నిజామాబాద్



మన భారతీయ పండగల్లో ఆరోగ్యదాయకమైన అంశాలు ఎన్నో ఉంటాయి. ముఖ్యంగా బతుకమ్మ ఉత్సవంలో ఉపయోగించే పూలన్నీ పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తాయి. మాది మహారాష్ట్ర.. పెళ్లితో ఇక్కడికి వచ్చి ప్రకృతి చికిత్స వైద్యురాలిగా స్థిరపడ్డా. అత్తమ్మ ద్వారా బతుకమ్మ పండగ గొప్పదనాన్ని తెలుసుకున్నా. ఇందూరులోని ఉత్తరభారతీయ మహిళలను ఒకే వేదిక మీదికి తీసుకువచ్చి బతుకమ్మ పండగను జరిపేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నాం. మార్వాడీలు, గుజరాతీయులు, మరాఠీలకు గ్రామీణ మహిళలతో బతుకమ్మ పాటలు పాడుతూ.. ఎలా ఆటలు ఆడాలో అవగాహన కల్పిస్తున్నాం.



# నాటి సీపీ.. నేటి ఎమ్మెల్యే..


నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా కేఆర్ నాగరాజు 2023 మార్చి 31 వరకు పని చేసి ఇక్కడే పదవీవిరమణ పొందారు. అనంతరం గతేడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. శుక్రవారం జిల్లాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి హాజరయ్యారు. నాడు సీపీగా సేవలందించి, నేడు ఎమ్మెల్యేగా జిల్లాకు వచ్చారు.

– ఈనాడు, నిజామాబాద్



## కర్షకుల కష్టాలు తెలపడానికే మహాసభ

**కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే:** కర్షకుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తేవడానికే భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 5న కామారెడ్డి జిల్లాకేంద్రంలో రైతుల రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నామని సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు పేర్కొన్నారు. జిలా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌ను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వావలంబన కిసాన్, సంపన్న గ్రామం, సమర్థ భారత్ అనేవి భారతీయ కిసాన్ సంఘ్ ధ్యేయమన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయ భాస్కర్, కొమిరెడ్డి అంజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగేష్, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు



## సీతాఫలం.. భలే వ్యాపారం

మధురం.. సీతాఫలం.. ఆ పేరు వినగానే ఈ సీజన్‌లో ప్రతి ఒక్కరు లొటకలేస్తుంటారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఇందిరాచౌక్, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో నిత్యం రూ.వేలల్లో సీతాఫలాల వ్యాపారం సాగుతోంది. నిత్యం ఇతర జిల్లాల నుంచి ఫలాలను దిగుమతి చేసుకుంటున్నారు. ఒక్కో గంపకు రూ. 150 నుంచి రూ. 200 విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో సీతాఫలం తినడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డితో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఫలాలను కొనుగోలు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

## దరఖాస్తుల ఆహ్వానం

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులను ఎంపిక చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ/ఎస్టీ కమ్యూనిటీకి చెందిన ఐదుగురు నాన్ అఫీషియల్ సభ్యుల ఎంపికకు, ఇతర వర్గాల నుంచి ఎన్‌జీవోలతో అనుబంధం కలిగిన ముగ్గురు సభ్యుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. సభ్యులకు ఎలాంటి నేరపూరిత రికార్డు ఉండకూడదని సూచించారు. డిగ్రీ విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి చేసిన సేవా నేపథ్యాన్ని దరఖాస్తుల్లో పొందుపరచాలని కోరారు.

## ముప్కాల్ ఎంపీడీవో మృతి



మహ్మద్ ముజఫరుద్దీన్

**ముప్కాల్, బాల్కొండ:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముప్కాల్ ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్(58) హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆదిలాబాద్‌కు చెందిన ఈయన గత ఫిబ్రవరిలో ముప్కాల్ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. గత నెల 30న ఆదిలాబాద్ నుంచి ముప్కాల్‌కు బస్సులో వచ్చారు. బస్సు దిగి మండల పరిషత్తు కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

## వ్యవసాయంలో ప్రయోగాత్మక ఆచరణ మేలు

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** ప్రయోగాత్మక ఆచరణతోనే వివిధ అంశాలపై సమగ్ర పట్టు సాధించే అవకాశం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు అన్నారు. కామారెడ్డి పురపాలక పరిధిలోని లింగాపూర్ జడ్పీ ఉన్నత బడిలో శుక్రవారం గ్రామ ప్రజలకు వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. సామాజిక వనరులు, పటాల ద్వారా ప్రదర్శన ఏర్పాటుచేశారు. మాల్తుమ్మెద ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్, విద్యార్థులు, కిసాన్‌సంఘ్ గ్రామ అధ్యక్షుడు బండారి శ్యాంరెడ్డి, కార్యదర్శి రాజేందర్ తదితరులున్నారు.



తాడ్వాయిలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

### అనుభవ పాఠాలు నేర్చుకుంటున్నాం

**తాడ్వాయి :** వ్యవసాయ కళాశాలలో తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శిస్తూ అనుభవ పాఠాలు నేర్చుకుంటున్నామని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి తాము పరిశీలించిన అంశాలను ప్రయోగాల రూపంలో శుక్రవారం ప్రదర్శించారు. విద్యార్థినులు వైష్ణవి, స్వాతిక, దివ్య, వినూత్న, ఆరీఫాలతో పాటు ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

**ఏషియన్ ప్రియా సినీప్లెక్స్** — ఈనాడు సినిమాలు

| | |
|---|---|
| సత్యం సుందరం | 11.00 2.20 6.00 9.20 |
| రాంనగర్ బన్నీ | 11.20 6.20 |
| దక్షిణ | 2.20 9.20 |

**వీ సినిమాస్**

| | |
|---|---|
| దేవర | 10.50 2.15 5.50 9.30 |

**ఏషియన్ దర్శన్**

| | |
|---|---|
| శ్వాగ్ | 11.00 2.00 6.00 9.00 |

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242

జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్‌లో మురుగు కాల్వలో చెత్త పేరుకుపోయింది. **-అఫ్జల్, వికాస్‌నగర్**



విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ దృష్టికి తేగా పూడిక తీసి సమస్య పరిష్కరింపజేశారు.

జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో చెత్త పేరుకుపోయింది **- అంజి, గొల్లవాడ**



సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరింపజేశారు.

దోమకొండ- అంబారిపేట మార్గంలో రోడ్లపైకి చెట్లు వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. **-అనిల్, అంబారిపేట**

పరిశీలించి చర్యలు తీసుకుంటాం **- శ్రీనివాస్, డీఈ. ఆర్‌అండ్‌బీ, కామారెడ్డి**

ఆరోవార్డులో పలు చోట్ల మురుగు కాల్వల వెంట పిచ్చి మొక్కలు పెరిగిపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. **- సాయి, బాన్సువాడ**



: ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత పిచ్చి మొక్కలు తొలగింపజేయించారు.

గుండారం, నడిమి, ఎల్లాపూర్ తండాల నుంచి నిత్యం రాత్రి అక్రమంగా ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నాయి.- **గణేష్, కొండాపూర్**

గస్తీ నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం .- **అనిల్, తహసీల్దార్, రాజంపేట**

**- న్యూస్‌టుడే, దోమకొండ, కామారెడ్డి పట్టణం, బాన్సువాడ పట్టణం, రాజంపేట**



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మహరాజ్‌లు, వార్‌కారీలు

## 28న పాదయాత్ర

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** ఈ నెల 28న పండరీపూర్‌కు పాదయాత్ర చేపట్టనున్నట్లు వార్‌కారీలు తెలిపారు. పాత బాన్సువాడ సంగమేశ్వరాలయంలో శుక్రవారం యాత్ర కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుర్కి సోమలింగేశ్వరాలయం నుంచి ప్రారంభమమై బాన్సువాడ మీదుగా నవంబర్ 12న పండరీపూర్‌కు యాత్ర చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిష్టాపూర్ రాములు మహరాజ్, నాందేవ్ మహరాజ్, హన్మాండ్లు మహరాజ్ తదితరులున్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ ఈవీఎం గోదాంను శుక్రవారం తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు గమనించారు. దస్త్రాలు పరిశీలన చేసి భద్రత సిబ్బందికి తగిన సూచనలు చేశారు. తనిఖీల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయపార్టీల ప్రతినిధులు మదన్‌లాల్, సంతోష్‌రెడ్డి, ఖాసీంఅలీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళాబాయి, డీటీలు అనిల్, ఇందిరాప్రియదర్శిని పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

**బీర్కూర్, న్యూస్‌టుడే:** వీరాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మీర్జాపూర్ సొసైటీ ఛైర్మన్ వెన్నం రాంబాబు ఆధ్వర్యంలో ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. చుట్టు పక్కల మండలాల నుంచి 14 జట్లు పాల్గొనగా నాలుగు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నట్లు రాంబాబు చెప్పారు.

### శిక్షణ తరగతులు ...

**పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'జల్ నల్ మిత్ర' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ మంచి నీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గ్రిడ్ డీఈ కౌశిక్ ప్రారంభించారు. పైపు లైన్లను బిగించు విధానం, నీటి నాణ్యత పరిశీలన, చేతి పంపులకు మరమ్మతులు, సింగిల్ ఫేజ్ మోటారుల వినియోగం/మరమ్మతులు తదితర అంశాలపై అవగాహన కల్పించామని ఏఈ రాచప్ప పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారి కిషన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఈ రాచప్ప

# బోధకులు కరవు

● ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరిస్థితి ఇదీ

**న్యూస్‌టుడే, బాన్సువాడ**



బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

జిల్లాలోని నాగిరెడ్డిపేట్, నిజాంసాగర్, బీబీపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అధ్యాపకుల కొరత ఉంది. సమీపంలోని ఇతర మండలాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి అరువుగా వెళ్లి ఈ కళాశాలల్లో విద్యార్థులకు బోధించే పరిస్థితి ఉంది. ఆయా కళాశాలలకు అధ్యాపకులను కేటాయించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

● బాన్సువాడ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రధాన అధ్యాపకుడిగా ఉన్న అసద్‌కు పిట్లం, నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఇన్‌ఛార్జి ప్రధాన అధ్యాపకుడిగా, బిచ్కుంద జూనియర్ కళాశాల ప్రధాన అధ్యాపకుడిగా ఉన్న మోహన్‌రెడ్డికి బీర్కూరు, జుక్కల్ మండలాల ఇన్‌ఛార్జి ప్రధాన అధ్యాపకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చి నెట్టుకొస్తున్నారు.

జిల్లాలోని కొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, ప్రధాన అధ్యాపకుల కొరత ఉంది. జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. సుమారు 6వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. నాగిరెడ్డిపేట్, బీబీపేట్, నిజాంసాగర్ కళాశాలలకు అధ్యాపకుల పోస్టులు మంజూరు చేయలేదు. దీంతో సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి అరువుగా అధ్యాపకులను పంపి విద్యార్థులకు బోధించాల్సిన పరిస్థితి ఉంది. వీటితో పాటు బీర్కూరు, నాగిరెడ్డిపేట్, బీబీపేట్, నిజాంసాగర్ కళాశాలలకు ప్రధాన అధ్యాపకుడి పోస్టు మంజూరు చేయలేదు. ప్రస్తుతం 20 కళాశాలలకు 13 మంది ప్రధాన అధ్యాపకులతో కళాశాలల నిర్వహణ సర్దుబాటు చేసుకునే పరిస్థితి ఉంది. ఈ విషయంపై జిల్లా నోడల్ అధికారి సలాం మాట్లాడుతూ.. 'జిల్లాలో మూడు కళాశాలలకు అధ్యాపక పోస్టులు మంజూరు చేయలేనిది వాస్తవమే. పక్కన ఉన్న అధ్యాపకులను వారంలో రెండు రోజులు పంపించి బోధన చేయిస్తున్నాం. ఉన్న అధ్యాపకులతో సర్దుబాటు చేసుకునే అవకాశం కల్పించాం. ప్రధాన అధ్యాపకులు కొన్ని కళాశాలలకు లేరు. సమీపంలోని కళాశాల ప్రధాన అధ్యాపకులకు ఇన్‌ఛార్జిగా ఇచ్చి సమస్యలేకుండా చేశాం' అని వివరించారు.

# 90 శాతం స్థానాలు గెలవాలి



బిక్కనూరు టోల్‌గేట్ వద్ద మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**బిక్కనూరు, న్యూస్‌టుడే:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ నాయకత్వంలో కామారెడ్డి జిల్లాలో 90 శాతం స్థానాలు గెలవాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ వెళుతున్న ఆయనకు బిక్కనూరు టోల్‌గేట్ వద్ద షబ్బీర్‌అలీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి పునాది అన్నారు. ఇప్పటివరకు కార్యకర్తలు నాయకులను గెలిపించేందుకు కష్టపడ్డారని.. ప్రస్తుతం వారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటామని షబ్బీర్‌అలీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, యూసుఫ్ అలీ, రాష్ట్ర యువ నాయకుడు ఇలియాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి పాల్గొన్నారు.

**బాన్సువాడ:** ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి నిజామాబాద్‌కు వస్తుండటంతో నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో శుక్రవారం తరలివెళ్లారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి బాన్సువాడకు చేరుకున్నారు. అక్కడ జెండా ఊపి ర్యాలీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నాయకులు జంగం గంగాధర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఖాలెక్, సురేష్, ఎజాస్, వాహబ్, అఫ్రోజ్, శ్రీనివాస్, సాయిలు, మధుసూదన్‌రెడ్డి, మోహన్‌నాయక్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

**మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే:** వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన తప్పిదాలను సవరించి ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని గున్కుల్ సొసైటీలో అధ్యక్షుడు వాజిద్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. తొలుత కార్యదర్శి అజెండా అంశాలను చదివారు. 756 మంది ఖాతాదారులు రూ.3.56 కోట్ల రుణాలు తీసుకోగా 178 మందికి చెందిన రూ.95 లక్షల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయని చెప్పారు. తప్పులను వెంటనే సవరించి అందరికీ మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నర్సింలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఆకాష్, మాజీ సీడీసీ ఛైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగభూషణ్‌గౌడ్, ఖాళీక్, సిద్ధు, కిష్టగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శిని నిలదీస్తున్న రైతు

## నాగన్న బావికి సందర్శకుల తాకిడి

**లింగంపేట, న్యూస్‌టుడే:** మండల కేంద్రంలో గల నాగన్న బావిని సందర్శకుల తాకిడి పెరిగింది. విద్యార్థులకు సెలవు దినాలు కావడంతో మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల నుంచి సందర్శకులు వస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడుపుతూ మధుర జ్ఞాపకాలను తమ చరవాణులలో బంధిస్తున్నారు.

# సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షురాలు అరుణతార

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని భాజపా జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. పట్టణంలోని ఓ వేడుక మందిరంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 7వరకు మూడు రోజుల పాటు ప్రత్యేకంగా ప్రతి బూత్‌లో ఇంటింటికీ తిరుగుతూ.. సభ్యత్వంపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

**లింగంపేట, న్యూస్‌టుడే:** లింగంపేట మండల కేంద్రంలోని ఓ వేడుక మండపంలో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్, బాణాల లక్ష్మారెడ్డి, నేరళ్ల ఆంజనేయులు, మండల అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్, మార్గం రజనీకాంత్, మంగలి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దాతల సహకారంతో అన్నదానాలు చేశారు.



మహ్మద్‌నగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు- అర్చన దంపతులు



అరగొండలో ...




జిల్లాకేంద్రంలో..



బాన్సువాడ పట్టణంలో.



దోమకొండలో గాయత్రీ దేవి అవతారంలో ..



బీర్కూర్‌లో..



తాడ్వాయిలో ...



ఇల్చిపూర్ సరస్వతీ క్షేత్రంలో



గాంధారి రేణుక ఎల్లమ్మ ఆలయంలో



దోమకొండలో...



నస్రుల్లాబాద్: నెమ్లిలో..



కామారెడ్డి పెద్దబజార్‌లో..

# బాధిత కుటుంబాలకు పరామర్శ

**నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే :** ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబసభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ మేరకు శుక్రవారం సంగెం, హజీపూర్, అంకోల్, లింగంపల్లి తండా, అంకోల్ తండాల్లో బాధితుల ఇళ్లకు వెళ్లారు. కుటుంబీకులను కలిసి అండగా ఉంటానని చెప్పారు. నాయకులు నందు పటేల్, శ్రీనివాస్ యాదవ్, ప్రతాప్‌సింగ్, శివప్రసాద్, కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సంగెంలో బాధిత కుటుంబ సభ్యులు, నాయకులతో ఏనుగు రవీందర్‌రెడ్డి

# ముదిరాజ్‌ల డిమాండ్లు నెరవేర్చాలి

**బీబీపేట, న్యూస్‌టుడే:** ముదిరాజ్‌ల డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడేటి సత్యం అన్నారు. బీబీపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయనను స్థానిక ముదిరాజ్ సంఘం సభ్యులు సన్మానించారు. ప్రతినిధులు ఆగం పాండన్న, శ్రీనివాస్, చంద్రం తదితరులు ఉన్నారు.



తోడేటి సత్యంను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

# ఆర్థిక సాయం

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో విద్యార్థులకు పిల్లల వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.60 వేలు వితరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రతినిధులు డా. విజయ్‌రాజ్, వెంకటేశ్వర్‌గౌడ్, వెంకట్రాజం, నరేందర్‌రావు, మల్లికార్జున్, శివప్రసాద్, కల్యాణి తదితరులున్నారు.



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న ప్రతినిధులు

**భిక్కనూరు, న్యూస్‌టుడే:** కంచర్లకు చెందిన మంగళి నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. బాధిత కుటుంబానికి శ్రీరామ సేవా సమితి సభ్యులు శుక్రవారం రూ.5,500 ఆర్థిక సాయం చేశారు. అదే గ్రామానికి చెందిన గాలెల రమేష్ 25 కిలోల బియ్యం అందించారు.

# జోరుగా టీఎన్జీవోస్ సభ్యత్వాల నమోదు

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** టీఎన్జీవోస్ సభ్యత్వాల నమోదు ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. సంఘం ప్రతినిధులు శుక్రవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఉద్యోగులకు సంఘ సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులందరు ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చక్రధర్, రాజేశ్వర్, కె.శివకుమార్, పాష తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వాలు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

# ఒక్కేసి పువ్వేసి చందమామ



భిక్కనూరులో ..



జిల్లాకేంద్రంలో రాంమందిర్‌లో..



గాంధారి: చద్మల్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో .



కామారెడ్డిలో వీక్లీమార్కెట్‌లో ..

ఒక్కేసి పువ్వేసి చందమామ, గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు ఆడిపాడారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద పెట్టి ఆడారు. అనంతరం నీళ్లలో నిమజ్జనం చేశారు. సద్దులు ఆరగించారు. కామారెడ్డి పురపాలక కార్యాలయం ఆవరణలో ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, సిబ్బంది బతుకమ్మ ఆడారు. **- న్యూస్‌టుడే బృందం**



పుర కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, సిబ్బంది



బాన్సువాడ పట్టణం: ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో..

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



హనుమ

**మాచారెడ్డి, న్యూస్‌టుడే:** కాకుల గుట్టలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కాకుల గుట్టకు చెందిన బనావత్ హనుమ (58) ఆటో చోదకుడిగా పని చేస్తున్నాడు. ద్విచక్రవాహనంపై మాచారెడ్డి చౌరస్తా నుంచి కాకులగుట్టకు వెళ్తున్నాడు. బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో హనుమకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయారు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

### కుంటలో పడి ...

**ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే :** ఎల్లారెడ్డి మండలం కొక్కొండ గ్రామానికి చెందిన కమ్మరి బ్రహ్మం అలియాస్ చింటు(18) గురువారం బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సమీపంలోని మేకల కుంటలో శవమై తేలాడు.

### ఆత్మహత్య

**పిట్లం, న్యూస్‌టుడే:** ఓ వ్యక్తి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం గ్రామానికి చెందిన జంగం విఠల్(37) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా తన ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో మనోవేదనకు గురై తాగుడుకు బానిసయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామ శివారులోని మారెడు చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు . భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.



విఠల్(37)

# భర్త, అత్తకు ఏడేళ్ల జైలు

**కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే:** వరకట్నం కోసం వేధించి వివాహిత మృతికి కారణమైన భర్త, అత్తకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ శుక్రవారం తీర్పును వెలువరించారు. ఎస్పీ సింధూశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో మల్లాని లావణ్య (24) అనే వివాహిత 2017 డిసెంబరు 26న బలవన్మరణం చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారించగా.. ఆమె ఆత్మహత్యకు భర్త మల్లాని గణేష్, అత్త ఎల్లవ్వలే కారణమని తేలింది. పోలీసులు సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు. నేరస్థులకు శిక్ష పడేలా చేసిన పీపీ రాజ్‌గోపాల్‌గౌడ్, పోలీసు అధికారులతో పాటు లైజనింగ్ అధికారి మురళి, సీడీవో ప్రమోద్‌కుమార్‌రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

## వృద్ధుడి అదృశ్యం

**పిట్లం, న్యూస్‌టుడే:** మండలంలోని పారెడుపల్లి గ్రామానికి చెందిన కత్తిగామ సాయిలు(57) సెప్టెంబరు 29న అదృశ్యమయ్యాడు. అతని ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలించినా లభ్యం కాలేదు. శుక్రవారం భార్య చంద్రవ్వ ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

### ఒకరి ..

**కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే:** జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముండే ఏలేటి అచ్యుత్‌రెడ్డి (50) ఈ నెల 3న బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. శుక్రవారం వరకు రాకపోవడంతో ఆందోళనకు గురైన ఆయన భార్య లలిత పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

# కొత్త ఏజెన్సీ నియమించాలని వినతి

**బీబీపేట, న్యూస్‌టుడే:** బీబీపేట టీఎస్ఎన్ఆర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కొత్త ఏజెన్సీని నియమించాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి సతీష్‌యాదవ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాత ఏజెన్సీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని, ఇప్పటికీ అమలు కాలేదన్నారు.

# విత్తనాల పంపిణీ

**బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని పుల్కల్ సొసైటీలో శనగ విత్తనాలను ఛైర్మన్ రామకృష్ణారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. 25 కిలోల బస్తా రూ.2250కు విక్రయిస్తున్నామని, ఆసక్తి గల రైతులు సంప్రదించాలని సూచించారు. సీఈవో సాయిప్రకాష్, ఏఈవోలు దయానంద్, సాయికిషోర్, డైరెక్టర్లు శ్రీనివాస్, పోచయ్య, రైతులు పాల్గొన్నారు.



శనగ బస్తాలను పంపిణీ చేస్తున్న ఛైర్మన్ రామకృష్ణారెడ్డి